# భారతనారి

★

శ్రీమతి వట్టికొండ విశాలాక్షి

(గత సంచిక తరువాయి)

ఏమిటది? అంటూ అట్టతిప్పి పుస్తకం నాముఖం ముందు పెట్టారు. సత్యం, పేరుకింద అదే పేరు ఏడెనిమిదిసార్లు పెన్సిలుతో వ్రాసిఉన్నది. అది చూసేటప్పటికి నాకు అయోమయమైపోయింది. అది ఆ విధంగా ఎవరు వ్రాశారో ఎలా వ్రాశారో... ఎందుకువ్రాశారోకూడా నాకు బోధపడలేదు. ఏమి సమాధానం చెప్పటానికి ఏమీతోచలేదు. చూస్తూ నిలబడ్డాను.

ఏం చెప్పవేం? అంటూ కాలిచెప్ప విడిచారు.

'మీకొక నమస్కారం. నన్ను చంపబోకండి, మీకుఇష్టం లేకపోతే వదిలైనావెయ్యండి. ఇదిమాత్రం నేను వ్రాయలేదు. నా దస్తూరీ అవునో కాదో కావలిస్తే పరీక్ష చేసుకోండి. అంతేకాని అనవసరంగా నన్ను అవమానించకండి. ఇవన్నీ నామీద ఎందుకు ఇలా నెట్టుకొస్తున్నవో నాకేంఅర్థంకావటల్లా' అన్నాను. నేనుమాట్లాడిన మాట ఒక్కటికూడా వారిచెవిలో దూరిఉండదు ఆ పరిస్థితుల్లో మానవత్వాన్ని కోల్పోయిన వ్యక్తి ఎలా ప్రవర్తిస్తాడో అదే మోస్తరుగా ప్రవర్తించారు. నీవీమరునిమిషానికే ప్రయాణం కట్టవలసిందేనని చెప్పారు. అంతలో మా అత్తగారు వచ్చారు. మొగుడు కొట్టినందుకుగాదు తోడికోడలు తొంగిచూచినందుకని ఒక సామెతున్నది చూడండి. అలాగే ఆమెకెక్కడ తెలిసిపోతుందోనని చాటుచాటుగా కళ్లుతుడుచుకొని గదిలోనుంచి బయటకువచ్చాను.

వాడు వచ్చాడట్టుందేం? అన్నదామె నాతో,

ఊఁ, అన్నాను.

'అప్పుడే వచ్చావేం? ఇంకాఏమన్నా ఉన్నయ్యేమో గాలించుకుపోదామని వచ్చావా? నువ్వీ వరసన వూళ్లమీద తిరుగుతుంటే నీ యింటికీ నీ పెళ్లానికి కావలనుకున్నావా ఇక్కడ నేను? నువ్వు వూళ్లంబడి తిరుగుతూవుంటే నామాట వింటారా పెద్దారా?

నీకేం తెలుస్తుది? ఎట్టాకొట్టా ఆ ముసల్దే చస్తది లెమ్మనుకుంటావు. ఇప్పటికి అరవై ఏళ్లు వచ్చినైనాకు. ఇంత పసిపిల్లల్ని దగ్గరకూర్చోపెట్టుకుని ప్రొద్దుపుచ్చుకొనే రోజుల్లో ఆ గీత లేకపోగా అది లేదని ఇదిలేదని ఇంట్లో వాటికోసమే దేవుళ్లాడాల్సొచ్చెనా బతుకంతా... ఇంకెప్పుడు నన్ను నువ్వు సుకపెట్టేది? ఆ గొలుసెందుకురా నువ్వు తీసుకుపోయింది? ఈ తినేముద్దకూడా పడిపోటానికా? నీముచ్చనూయ.' అని అంటున్నదామె.

'అహఁ ఇక చాల్లే ఆ ఉపన్యాసం కట్టిపెట్టు అంతటితో. నువ్వు నాయిల్లుచూడద్దు, ఎవర్నీ చూడద్దులే' - అంటూ వాకిట్లోకి లేచిపోయారు. కాసేపట్లో వాకిటముందు బండి నిలబడిఉన్నది.

మళ్లీ బండెక్కడికిరా అన్నదామె. వారు నావైపు చూచిపెట్టె గిట్టా సర్దుకున్నావా అన్నారు.

పెట్టెక్కడికీ అన్నదామె రాగంతీస్తూ.

అదుగో బండివాడు వస్తున్నాడు. నీ పెట్టె ఇచ్చేసెయ్యి - అన్నారు.

ఎక్కడికే అన్నదామె మళ్లీ నాతో. ఇంటికన్నాను.

ఇంటికా? ఏమిరా? మొన్నటిదాకా నువ్వు తిరిగొచ్చావు. మళ్లీ దాన్ని తిప్పబోతున్నావా? నేను చెయ్యలేనయ్య మీయిష్టం. నాకెందుకు నేను పోతా ఎటోఅటూ అన్నదామె. నేనలాగే నిలబడున్నాను ద్వారబంధాని కానుకొని.

'మళ్లీ తగలాలా? ఎన్నిసార్లు చెప్పాల బండెక్కమని?' అన్నారువారు. నాకళ్ళంబడి నీళ్లు బొటబొట కారుతున్నవి. పెట్టె బండివాని కివ్వటానికి సర్దుతున్నాను.

ఏమిట్రా ఏమిటే? అన్నదామె ఆదుర్దాగా.

ఏమీ లేదు. దీన్నసలు మనింట్లో ఒక్క నిముషంకూడా ఉండనివ్వకూడదు. అని అంటున్నారు వారు. నాకు ఇష్టంలేని పనేచేయవలసి వస్తున్నందుకు దుఃఖం పొర్లుకొచ్చి ఆవురుమన్నారు.

'ఒకే ఒక్కదాన్నే పంపిస్తే మనల్ని మాత్రం నవ్వరట్రా? ఏదన్నా తప్పంటే వాళ్లనాన్నను పిలవనంపిస్తే వాళ్లే చూచుకుంటారు. నేనుంటిని గాయ్యి. పెద్దముండ అదన్నా చెప్పకూడదా అనుకుంటారు. ఇదిచేసేది లోకానికేం తెలుస్తుందంటా.' అని అంటూ వున్నదామె. పెట్టె సర్ది గదివాకిట్లో నిలబడ్డాను నేను. వారు పెట్టె బండివాడిచేతికిస్తున్నారు. నేనొకసారి మా అత్తగారి ముఖంపైపు చూచాను జాలిగా.

'నన్నేం చెయ్యమంటావమ్మా? చూస్తానే వుంటివిగా. నా మాట వాడువింటాడు గనకనా పెడ్తాడు గనకనా? మీలోమీరు ఏమనుకొంటున్నారో ఏంజేసుకొంటున్నారో నాకేం తెలుసమ్మా? వాడేనంటే వాడికంటే మూడాకులు నువ్వు ఎక్కువ ఐపోతివి. ఇవాళనుకుంటారు. రేపుబాగుంటారు. ఎటుతిరిగీ మీరుమీరు ఒకటేనమ్మ, నేనే లేడా అవుతాగాని.' అన్నదామె. ఎక్కవేంబండి - అని ఒక్క కేక వేశారు. ఇక నాకు ఎక్కడలేని ధైర్యం వచ్చింది. ఛీ అక్కరలేని వాళ్లతో ఎందాకా అతుకు పెట్టుకుంటాం? ఏదైతేమాత్రమేమి? ఏ సమయానికి ఏది చేయవలసివస్తే అదల్లా ధైర్యంతోనే చేసితీరాలనుకొంటూ బండి ఎక్కాను. పరిష్కారం చేయలేని కొన్ని కొన్ని సమస్యలనుగురించి తీవ్రంగా ఆలోచించుతామేకాని తెలియక, వాటంతటవేపరిష్కారమౌతవికాబోలు ననుకొన్నానప్పుడు. అంతటితో నా విషాద జీవితంలోని ఒకభాగం సమాప్తమైంది.

నేను మా పుట్టింటికి వచ్చినతరువాత ఎన్నడు మాయింటికి రానివాళ్లుకూడా ఏదో ఒక వంకబెట్టుకుని మాయింటికి వస్తూండేవాళ్లు. అట్లా చిక్కిపోయావేం? ఏమన్నా జబ్బుచేసిందా? అనీ, మీఅన్నయ్య అత్తగారింటిదగ్గర ఉన్నాడు కావాల, ఎవరు తీసుకొచ్చారని, ఒక నెలవుంటావా, తొందరగానే వెళ్లాలా? అనీ ఇలా ప్రశ్నలమీద ప్రశ్నలు కురిపించేవాళ్లు. అసలు విషయం వాళ్ళకు తెలియక కాదు. మేమే విధంగా చెప్తామోనని. మా నోటిమీదగా చెప్పించి వినాలనీ, అలాంటి ప్రశ్నలతో మమ్మల్ని అస్తమానమూ బాధిస్తూండేవాళ్లు. ఇక్కడకు వచ్చిన కొత్తరోజుల్లో మొగుడుకొట్టి వెళ్ళగొట్టాడట, అనీ, దీని వ్యవహారం మొగుడుకి తెలిసే అట్లాచేశాడట అనీ చాటు చాటుగా ప్రచారం చేస్తూనే వుండేవాళ్లు—అలాంటి వ్యవహారాలలో ఆరితేరినవాళ్లు కొంతమంది. నన్ను బాగా ఎరిగున్నవాళ్లు ఇప్పుడేకాదు అప్పుడుకూడా నామీద మాట పడనిచ్చేవాళ్లు కాదు.

నేనసలు ఇల్లువదలి పడిపంచలు చేరవలసి రావటం సత్యం నెపంతోనేకదా. తన కారణంవల్ల నేనీ విధంగా కావటాన సత్యం ఎంత బాధపడుతుంటాడు. బాధపడడుమరీ? సత్యానికి నాకువున్న పరిచయం తెలిస్తే సత్యమేకాదు హృదయంవున్న వాళ్లెవళ్లైనా బాధపడి తీరవలసిందే.

సత్యము నేను చిన్నప్పటినుండి ఒకేస్కూల్లో చదువుకుంటుండేవాళ్లం. నాతోపాటు ఇంకాకొంత మంది ఆడపిల్లలుకూడా వుండేవాళ్లు ఆ స్కూల్లో. ఏ కారణాల వల్లనోకాని సత్యం మా అందరికంటే పెద్దవాడైనప్పటికీ చేరీచేరటమే మా క్లాసులోనే చేరాడు. మాఅందరిలో సత్యం ఇముడలేకపోయాడు. మాకు ఆలస్యంగాను సత్యానికిత్వరగాను పాఠాలు వస్తుండేవి. చివరకు ఆయనకు వేరేక్లాసుపెట్టి చదువు చెప్పవలసివచ్చేది. మిగిలిన మా అందరిలోకి మళ్లీ నాకు త్వరగా పాఠాలు వస్తుండేవి. ఎప్పుడైనా మేస్టరుగారు మాక్లాసుకి సత్యాన్ని పాఠాలు చెప్పమనేవారు. వాళ్లందరికీ చెప్పబోయి వాళ్లకు త్వరగా రాకపోవటాన విసుక్కుంటుండేవాడు. నాకు చెప్పటం అంటే సరి చాలా సరదాగా చెప్పేవాడు. చదువుకునేటప్పుడు ఎక్కువగా మేమిద్దరమే జంటగా తిరుగుతుండే వాళ్లం. మాయిల్లు వారియిల్లు దగ్గరగానేవుండేవి. పైగా ఎక్కడో ఏదోకొంచెం బంధుత్వంకూడా కలిసివున్నదని పెద్దవాళ్లు చెపుతుంటారు. ఈ కారణాలవల్ల సత్యానికి ఫలానావారమ్మాయినియిచ్చి చేస్తారట. అనిజనం అనవసరంగా వాడుకలు పుట్టించారు. అప్పటికి నాకంతగా ఏమీ తెలియదు. సత్యానికిమాత్రం బాగా ఏమోకాని కొంతవరకైనా తెలిసే వుండవచ్చు. నాకు తెలిసిం

దల్లా సత్యానికిబాగా పాఠాలు వస్తవనీ, నాకంటే సరదాగా పాఠాలుచెప్తాడనీ, ఏదైనా తెచ్చిపెట్టానంటేసరి నాకోసం ఎంతకష్టపడైనాసరే తప్పకుండా తెచ్చిపెడతాడనీ,అంతవరకుమాత్రం తెలుసు. స్కూల్లో తతిమ్మా పిల్లలంతా అబద్ధాలాడుతుంటే వాళ్లేకాని సత్యంమాత్రం అబద్ధం ఆడడనీ, సత్యం సత్యమేననీ ఇదొక వాడుకకూడా.

అప్పుడు సత్యంఅంటే నాకుచాలాఇష్టంగానే వుండేది. తరువాత నేనుకొంచెం ఎదుగుతున్నకొలదీ సత్యం సహవాసానికి మావాళ్లు నన్ను పోనిచ్చేవాళ్లు కాదు. మాపెద్దవాళ్లు వాళ్లపెద్దవాళ్లుకూడా బాగానే వుంటుండేవాళ్లు. ఫలానావారమ్మాయిని సత్యానికి ఇచ్చి పెళ్లిచేస్తారట అని జనం చెప్పుకుంటూనే వుండేవాళ్లు. జనం ఆ విధంగా చెప్పుకోగా చెప్పుకోగా-చివరకు మా పెద్దవాళ్ళకుకూడా ఆ ఉద్దేశాలే కలిగినవి. అంతలోనే నేను పెద్దదాన్నయాను.

అంతకుముందే సత్యం చెబుతుండేవాడు ఇంకా కొద్దికాలానికి నిన్ను మీవాళ్లు చదువు మాన్పించటానికి ప్రయత్నంచేయవచ్చు. నీవు మాత్రం చదువుకోవలసినదేనని పట్టు పట్టుమని. ఆయన చెప్పినట్లే ఇకస్కూలుకు పోవద్దన్నారు మావాళ్లు. నేను పట్టు పట్టాను కాని లాభం లేకపోయింది. నేను పెద్దదాననైన తరువాతకూడా సత్యం ఏదైనా పనిమీద మా యింటికి వస్తూనేవుండేవాడు. మొదట మొదట సత్యానికి చాటుకు పోవాలో ఎదుట వుండాలో తెలిసేదికాదు. నాలో ఏదోఒక కొత్తదనం రావటాన ఎదుటవుండటానికి సిగ్గుగానే వుండేది. నిన్నమొన్నటివరకు కలసిమెలసి తిరుగుతూ ఒక్కసారి చాటుకు పోపోయినా ఏమనుకొంటాడోననీ వుండేది. నాకు తెలియకుండానే రెండుపనులు చేస్తూనే వుండేదాన్ని. సత్యంవచ్చినా మా అమ్మతోనో మా నాన్నతోనో మాట్లాడి పోయేవాడుకాని నాతో ఏమంత ఎక్కువగా మాట్లాడేవాడేకాదు.

ఒక్కనాడుమాత్రం చేతిరుమాలమీద సన్నని మెలిక కుట్టుకుడుతున్నాను. నాదగ్గర సరీగా ఇలాంటిదే ఒకటిఉన్నది కాని సాదాగావుంటుంది, అదినీవు తీసుకుని ఇదినాకు ఇస్తావా అన్నాడు. అలాగే ఇస్తానన్నాను, ఒకసారి తనేమో కథ వ్రాశానని, ఆకథ ఫెయిర్ చేసి పెట్టమని అడిగాడు. అలాగేచేసి పెట్టాను. అలాఆయన నాకేవైనా చిన్న చిన్న పనులు చెపుతుండటం నేను చేసిపెడుతుండటం అలవాటైపోయి ఎప్పుడుఏది చెప్పినా సరేలెమ్మంటుండే దాన్ని, ఒక్కసారి కాబోలు అన్నాడు. నేను ఇప్పుడు ఏది చెప్పినా ఒక్కసారైన చెయ్యనంటావేమో అంటే అనవేమి? అని. చెయ్యనని ఎందుకనాలి అన్నాను.

కాదు సాధారణంగా ఇతరులు ఎప్పుడు ఏదో ఒకపని చెపుతూవుంటే విసుగ్గాఉండదుమరి? అనేవారు. నాకు అలావుండదని చెప్పేదాన్ని. నిజంగా నాకు ఇంట్లో పనులకంటే సత్యమేదైనా పని చెప్తే ఎంతో సరదాగా చేసిపెట్ట బుద్ధయ్యేది. నాకలా వుండటానికి ఆశక్తి ఆయనలోనే ఏదోవున్నది. నేను అలాగే ఆయన ఏబస్తీకన్నా వెళ్తున్నారని తెలిస్తే సరి గాజులనీ, రిబ్బన్లనీ, ఏవేవోపనులు పురమాయించేదాన్ని. ఆయన ఒక్కటికూడా మరచిపోకుండా తెచ్చిపెట్టేవారు. అలా ఇద్దరం పూర్వంలాగానే స్నేహంగా వుంటుండేవాళ్లం. తరువాత సత్యానికి వున్నఆస్తీ కాస్తా వాజ్యంలో చిక్కుకుపోయింది. అది అప్పట్లో తేలేటట్లుగాకూడా లేదు. అందువల్ల నన్ను ఎక్కడైనా వేరేఇచ్చి వివాహం చేస్తే బాగుండునని మావాళ్లు ఆలోచించటం మొదలుపెట్టారు. అప్పటినుండీ, ఎప్పుడో ఏమోకాని సత్యం మా యింటికిరావటం మానివేశాడు. నాకు వేరే సంబంధాలు రావటం ప్రారంభించాయి. నిజంగా నాకీ సంబంధం ఎంతమాత్రం ఇష్టంలేదు. అయినా మానాన్నముందు మూడేళ్ళ పసిపిల్లకూడా ఎదురుచెప్పే వీలులేదు. నాకువచ్చిన సంబంధాల్లో ఇంత నిక్షేపంలాంటి సంబంధాన్నే మావాళ్లు ఖాయం చేశారు.

తరువాత రెండుమూడు రోజులకే నన్ను పెళ్లికూతుర్ని చేశారు. నాకు పెళ్లికళరాలేదనీ, నాకీసంబంధంఇష్టంలేకపోవటానికి కారణం సత్యానికి నాకు ఏదో ఉండిఉంటుందనీ, అమ్మలక్కలంతా అప్పుడే చెప్పుకోవడం ప్రారంభించారట. అదే అలాఅల్లుకుని అలా అల్లుకుని మా అత్తగారు మా వారివరకు కూడా పాకింది. అదుగోపులి అంటే ఇదుగోతోక అనేవాళ్లేకాని అసలక్కడ పులివున్నదో లేదో కాస్త ఆలోచించి తేల్చుకోగల విజ్ఞానం మనలో

ఎంతమందికున్నది? వాళ్లవీళ్ల మాటలునమ్మి మావారు, ఎలాగైనా పిల్లా జల్లా కలిగేటట్లుగాలేరు, పైగా సొమ్ముకూడా రాలేదని దీన్ని వెళ్ళగొట్టి ఇంకొక దాన్ని తెచ్చుకుంటే బాగా కట్నుకొస్తుందని మా అత్తగారూ, ఇద్దరు ఏకమై నన్నీవిధంగా చేశారు. ఎవరైనా అదేమని అడిగితే ఒక్కపనన్నా ఒళ్లువంచి చేసేదేకాదనీ, చెప్పినట్లుగా వినేదికాదనీ, ఎదురు తిరిగి ఏది పడితే అదిఅంటుందనీ, అలాంటి దానితో మేమెట్లా కాపురం చేయించుకుంటామని చెపుతుండేవాళ్లు. నేను ఇక్కడకు వచ్చినకొత్తలో. ఆ మాటలు పట్టుకొని మా అమ్మకూడా 'మేము ఇక్కడ వున్నాంకదా అని పరుగెత్తుకొచ్చావా? రేపు వాళ్లింక దేన్నన్నా కట్టుకుంటే నిన్నుకూడా మానెత్తిన ఎక్కడ ఎక్కించుకుంటామనుకున్నావు అయిన తరువాత వాళ్లుచెప్పినట్లుగా వినకపోతే ఎట్లాగనీ, వాళ్లు తిట్టినాపడాలి కొట్టినా పడాలి, తప్పుతుందామరి? ఈరోజుకీ నేనుపడేవి నేను పడట్లా?' అనీ, చాటు చాటున కోప పడుతూ ఉండేది. నా బాధ్యత, తనమీద పడితేఎట్లాగా, అనే భయంవల్లను తనకూతురు కాపురం చేయటం లేదని లోకం నిందిస్తుందనీ జంకువల్లను ఆవేదనంతా భరింపలేకనో ఏమో, ఇలాంటి విషాదపరిస్థితుల్లో వున్న నన్ను ఆదరించటానికి బదులు ఒకొకసారి ఎంత ఉక్రోషాన్నైనా వెళ్లబోసేది. అలాంటి పరిస్థితుల్లో నా స్థితిమరీ అధ్వాన్నమైపోయేది. నాకు శాంతి అనేది ఎక్కడ? ఎవరికైనా ఒకచోట దెబ్బతగిలితే ఇంకొకచోట విశ్రాంతిఉండాలి. ఆ మాత్రంకూడా స్థానంలేనప్పుడు మనమింకా ఈ బ్రతుకు బరువును మోయగలిగేదెట్లా? ఫుట్‌బాల్‌ను తన్నినట్లుగా ఇటువస్తే వీళ్లొకతన్ను అటుపోతే వాళ్లొకతన్ను తన్నుతూవుంటే మనగతేంకాను? ఈ కష్టాలన్నీ ఎవరికి చెపితే ఎవరి హృదయంలో దాచుకోగలుగుతారు? ఈ అంతులేని కష్టపరంపర ఎప్పటికైనా దానంతట అది విరమించవలసినదేకాని ఎవరికి చెపితేమాత్రం ఎవరు తీర్చగలుగుతారు?

సత్యం వ్యాజ్యం జయించి తనకుతగిన ఇంకొక అమ్మాయిని వివాహం చేసుకొని వ్యాజ్యంతోపాటు జీవితాన్నికూడా జయించాడు. ఎంత అదృష్టవంతుడు అని నేననుకుంటుంటానేకాని ఆయనకుమాత్రం ఆ విశ్వాసంలేదు. అంటే తను వ్యాజ్యం జయించ లేదనీకాదు, తగిన అమ్మాయిని, వివాహం చేసుకోలేదనీకాదు. జీవితాన్నే జయించాననే విశ్వాసంమాత్రంలేదు. నా వివాహమైన తరువాత ఆయన నేను రెండుమూడు సంవత్సరాలు మాట్లాడటమే సంభవించలేదు. వారింట్లో వారెవ్వరూ మా యింటికి వచ్చేవారుకారు. మేమెవ్వరమూ వారింటికి వెళ్లేవాళ్లంకాదు. అందువల్ల ఎప్పుడైనా బజార్లో అలా వెళుతూవుంటే దూరాన్నుంచీ చూడటమేకాని, దగ్గర్లో కలుసుకోవటంగానీ, మాట్లాడటంగాని జరిగేదికాదు. తరువాత వారిఅమ్మకు చాలా జబ్బుచేసింది. దాదాపు బ్రతకదన్న పరిస్థితుల్లో మేము వారింటికి వెళ్లటం, తరువాత తరువాత వారుకూడా మా యింటికిరావటం జరుగుతూ ఉన్నది. సత్యము నేనుకూడా మామూలుగానే మాట్లాడుకుంటుండేవాళ్లం. మా పెళ్లిళ్లు కాకముందులాగా అంతచనువుగా మాట్లాడుకునేవాళ్లం కాదు. ఎక్కువగా నేను నా కష్టాలను గురించే చెపుతుండేదాన్ని. ఆయన చాలాబాధపడుతుండేవాడు. నాకష్టాలు అలా చెప్పి చెప్పి ఆయన మనస్సును పాడుచేయటం నా కంత ఇష్టం ఉండేదికాదు. అందుకని నేను మాఅత్తగారింటి దగ్గరనుండి వచ్చిన కొత్తరోజుల్లో ఏమిటి సంగతులు ? అని ఆయన అడిగినా ఏమీలేవు సంగతులు అనేదాన్ని ఒకొకసారి. నేను అలా అన్నప్పుడు నా పరిస్థితులు తనకు తెలియజేయటం లేదని ఆయనకుఎంతో కష్టంగావుండేది. నేనేమైనా ఆయన్ను అడిగితే ఆయనకూడా చెప్పేవారుకాదు. నేను నా కష్టాలనుగురించి చెప్పకపోతే ఆయన బాధపడ్తారనిగానీ, నేనే చెప్పకుండా దాచుకోలేకపోవటం వల్లగాని ఎక్కువగా చెపుతూనేవుండేదాన్ని. నేను మావారి మన స్తత్వాన్ని గురించిచెపుతూవుంటే ఒకొకసారి ఆయనముఖం కోపంతోఎఱ్ఱబారి, విచారంతో కమిలిపోయేది. మీరుమాత్రం తగిన ఆమెను వివాహం చేసుకొని వ్యాజ్యంతోపాటు జీవితాన్నికూడా జయించారు అన్నానొకసారి ఆయన్ను విచారాన్నుంచి మరల్చటానికి. నీవీలాంటి బాధలనుభవిస్తున్నంతవరకు నేను నా జీవితాన్నే జయించాననుకోలేను అన్నారు. ఆయనకు నామీద వున్న ఇలాంటి కరుణవల్లను, నన్నుపూర్తిగా అర్థం

చేసుకున్నందువల్లను, నాకు ఆయనమీద ఎంతైనా అభిమానము, గౌరవము ఆదరము ఉంటవికాని అంత కన్నా ఇంకేమీ లేదు. ఇదంతా ఇతరులు అర్థంచేసుకోవాలంటే సామాన్యమా ? ఆలోచనలతో నిమిత్తం లేకుండా ఎవరిష్టంవచ్చినట్లు వారు చెప్పుకుంటూరు.

నేను మాయింటికి వచ్చినతరువాత అప్పటికింకా మంచిచీర కట్టుకొనిగానీ, తలలో పూలు పెట్టుకొనిగాని ఎరుగను. ఎందుకో ఒకసారి డ్రామాకు వెళ్ళాలనిపించింది. అందరువెళ్తూ నన్ను కూడ రమ్మంటే, సరేనని ఆరోజు ఇస్త్రీచీరకట్టుకొని ఇస్త్రీజాకెట్ తొడుక్కుని ఒకసారి అద్దంలో చూచుకునేటప్పటికే తల్లోపూలుకూడా పెట్టుకుంటే బాగుండుననిపించింది నాకు తెలియకుండానే. నేను వెళ్ళే దారిలోనే సుబ్బమ్మగారి ఇల్లుంది. ఏకాలంలోనైనాసరే వారింట్లో ఏవో ఒకపూలు పూస్తూవుంటవి. మా పొరుగింటామేకదా అని పూలు కోసుకోటానికి వారింటికి వెళ్లాను. అంతా వూరికివెళ్ళటాన ఆమె ఒక్క ఆమే వున్నది ఆ ఇంట్లో. ఆమె నాకు ఎదురువచ్చి ఎక్కడికి? ఏమిటి? అని అడిగిందాశ్చర్యంగా. డ్రామాకు వెళ్తున్నామన్నాను.

డ్రామాకువెళ్తే ఇస్త్రీచీర కట్టుకోవాలా? అన్నది మళ్ళీ.

పదిమందిలోకి వెళ్లేటప్పుడు మామూలు చీరైతే ఏం బాగుంటుందని కట్టుకున్నాను. పూలున్నవిగా మీచెట్టున - అంటూనే చెట్టుదగ్గరకు పోతున్నాను.

ఎవరెవరు వెళ్తున్నారు డ్రామాకు? వెళ్తే పూలెందుకు? అని ప్రశ్నలమీద ప్రశ్నలుకురిపిస్తూనే వున్నదామె. నేనామె ప్రశ్నల్లో కౌటిల్యాన్ని గ్రహించక పోలేదు. నాఅంతటనాకు ఎన్నాళ్ళకో పూలుపెట్టుకోవాలనే కోరిక కలగటంవల్ల ఆమె మాటలను లక్ష్యపెట్టకుండా అలాగే పూలుకోశాను. కాని ఆమెమాత్రం ఏవిధంగానైనాసరే నా ఉత్సాహాన్ని చంపివేయాలనే ధోరణిలోనే వున్నది. గచ్చుమీదకూర్చుని పూలు ముందు వేసుకొని తల్లో పెట్టుకోటానికి వీలుగా మడుస్తున్నాను.

భర్తదగ్గర లేకపోతే పతివ్రతలు పూలుపెట్టుకోరు అన్నదామె. పుటుక్కున ఆ మాట కొంచెం మందగించిన నా ఉత్సాహపు పుటలలో ఒకపిడుగు పడినట్లైంది. అయినప్పటికీ సమాధానం చెప్పకుండా వుండటం ఏమంత బాగుండక వెనకటిరోజుల్లో ఎవరో చేశారని ఇప్పటలా ఎవరు చేస్తున్నారు? అన్నాను కుంగిపోతున్న ఉత్సాహంలోనుంచీ కొంచెం తెప్పరించుకుని.

'వెనకేమిటి? ఇప్పుడైనా భర్తదగ్గరలేనివాళ్లు భర్తమీద ప్రేమగలవాళ్లైతే పూలుపెట్టుకోరే. ఎక్కడదాకానో ఎందుకు? మాచెల్లిలి భర్త జైల్లో వుండగా మా చెల్లెలు ఒక్కనాడైనా తల్లోపువ్వు పెట్టుకోనెరుగునా? భర్తమీద ప్రేమగలవాళ్లెవరైనా అంతే. అసలదిపతివ్రత లక్షణంకూడా.' అన్నదామె మళ్ళీకొంచెం ఉద్రేకంతో. వాళ్ళచెల్లెలు పూలు పెట్టుకొనేదో లేదో బాగాజ్ఞాపకం లేదుగాని వారానికి రెండుసార్లయినా సినిమాలకనీ వాటికనీ, వీటికనీ ఎక్కడికో ఒక చోటికి పోతూనేవుండేది. ఆమె భర్త జైల్లోవున్నాడని ఆమె మంచి మంచి చీరెలు కట్టుకోకపోవడంగానీ, సరదాగా వుండక పోవడంగాని ఏమీ వుండేదికాదు అంతామామూలుగానే వుండేది. అన్ని విషయాల్లోను మామూలుగానే వుంటూ పూలెందుకు పెట్టుకునేదికాదో మరి నాకర్థంకాలేదు. బహుశః ఏ శాస్త్రాన్నో పట్టుకుని అలావుంటేగాని పతివ్రతఃను కామేమోననుకొని అలా చేసివుండవచ్చు.

నిజమే ఆమెఅన్నట్లు ఆమె చెల్లెలికి భర్తమీద ప్రేమ ఎక్కువగా వుండటానే పూలుపెట్టుకోలేక పోయేదేమో. వాళ్ళు భార్యాభర్తలు ఒకరికొకరు తగినవారు కావటాన బాగా మనస్సులు కలసిపోయే వుండవచ్చు. వాళ్ళకు అన్నీ కలసివచ్చినవి. వాళ్లు శుభసమయాల్లోనైనా కష్టసమయాల్లోనైనా మంచినే సంపాదించుకోటానికి అవకాశములున్నై. కాని నేనో, నాకు నిజంగా వారిమీద అంత ఎక్కువగా ప్రేమలేనిమాట వాస్తవమే. అది నాతిప్పా? నాకు తగినంతలో నేను కాంక్షించినవేవీ వారిలో లేకపోవటం తప్పా. ఉన్నదేదో ఉన్నది లెమ్మని కొంత సానుభూతితో ఆలోచించుకుని ఆత్మసంతృప్తి అయినా పొందుతుండేదాన్ని ఇదివరకు. నన్నీవిధంగా చేసిన తరువాత అదికాస్తా పోయిందిమరి. దానికి నే నేం చేయగలను? ప్రేమవుండడం లేకపోవటం మాట అలావుంచి జీవితంలో సుఖపడేఆశలు ఎప్పుడైతే పోతవో సాధారణంగా అప్పుడే ప్రతివస్తువుమీద

వదినలు మాకు పూర్తిగా వ్యతిరేకమైనారు. ఆఖరికి మా అక్కచెల్లెళ్లదగ్గరనుంచి కూడా వ్యతిరేకతే ప్రారంభమైనది. అయినప్పటికీ ఈ భారాన్ని నాకంటే మా అమ్మే ఎక్కువగా మోస్తూ వుంటాన నాకు కొంత సులభమేఅయింది. కాని నే నెంత పనిచేస్తున్నా ఇంకా పనిచెయ్యటంలేదని, నాకు అంత ఖరీదుగల చీరెలు జాకెట్లు ఎందుక్కొనాలనీ ఏదోరకంగా మా వదిన, అక్కచెల్లెళ్లు అందరు పేచీలు పెడుతూనే వుండేవాళ్లు. అంటే దానికి కాపురమా కాలిపోయిందా? ఏ గుడ్డలిస్తే మాత్రం ఏం కట్టుకు నింట్లో పడుండేదానికి? అనే ధోరణిలో మాట్లాడుతూవుండేవాళ్లు వాళ్ళంతా. అయినా వీటిని నే నేమంత లక్ష్యపెట్టలేదు. నేనింకా ఎక్కువ విచారంలో మునిగిపోటానికి వేరే కారణం వున్నది.

మా నాన్నగారు నా పెండ్లికాకముందు, అయిన తరువాతకూడా కొంతకాలంవరకూ, మనిషిని చూస్తేనే భయంగాను, ఎంతో హుందాగాను వుండేవారు. అలాంటివారల్లా ఒక్కగానొక్క కొడుకైతే మా అన్నయ్య కూడా తనమాట వినకపోవటం, కేవలం భార్యను వాళ్ళవైపు వాళ్ళను వెనకవేసుకుని ప్రతి దానికీ కయ్యానికి కాలుదువ్వటం, ఒక్కడుగదా ఏవిధంగానైనా చదువు చెప్పించి అభివృద్ధిలోకి తీసుకురావాలంటే చదువుకోకపోగా ఎక్కడ అప్పులు పుడితే అక్కడల్లా నోట్లువ్రాసి అప్పులు చేయటం, ఇవన్నీ మొదలుపెట్టేసరికి అదొక విచిత్రంగా మారిపోయారు. అంతకుపూర్వం వున్న గంభీరత, ఇంట్లోవాళ్ళను గడగడలాడించటం అదంతా మారిపోయింది. మరీ మా సంసారం అట్లా అయిన తరువాత ఆయన కసలు మతేపోయింది. ఆయన మనస్సుతోపాటు ఆరోగ్యం కూడా పూర్తిగా చెడిపోయింది. నే నిక్కడకు రావటాన్నిగురించి మేమంతా అనేకవిధాలుగా కిందా మీదా పడుతూ వుండేవాళ్లమా? ఆయన ఒక్కనాడైనా నాతో ఏమిటిది అనిగాని, నీవు వెళ్లు, వెళ్ళవద్దు అనిగాని ఒక్కసారికూడా నోటా పల్లాపట్టి అడిగిన పాపాన పోలేదు మానవుడు. కాని మా అమ్మ ఇలా మెదలకుండా వూరుకుంటే ఎట్లామరి? అసలు సంగతేమిటో కనుక్కొనిరాక. అని అనగా అనగా ఒకసారి కాబోలు బయలుదేరి వెళ్లారు మా అత్తగారి వూరికి. వెళ్ళటం కూడా వారింటికే వెళ్లారు. ఎందుకలా పంపించాలిసొచ్చింది? ఎన్నడు మాబోటివాళ్ళకన్నా ఎదురు చెప్పే పిల్లకాదే. మా పిల్లలందర్లోకీ ఈ అమ్మాయి ఇంకా నిదానమైనది. ఏమిటిదంతా? అని అడిగారట వారిని.

మీ పిల్ల మీకు ఎదురు చెప్పకపోతే అందరికీ ఎదురు చెప్పదని నమ్మకమేమిటి? అది ఎన్నెన్ని చిత్రాలు చేసేదో మీకేం తెలుస్తుంది. మేం చెప్తే మాత్రం మీరు నమ్ముతారా? అని మా అత్తగారు అందుకున్నదట.

మీరుండండి మిమ్మల్ని కాదు నే నడిగింది. ఆయన్ని సమాధానం చెప్పనివ్వండి అన్నారట మా నాన్నగారు.

ఇంకా ఇంతమంది చెప్పటాని కేమున్న దక్కడ? ఎవరుచెప్పినా అదే—అన్నారట వారు. సరే మీ అల్లుడిచేతనే చెప్పించుకోండి నేనొద్దన్నానా అని మా అత్తగారు అన్నదట.

ఒక రడిగే దేమిటి ఒకరు చెప్పే దేమిటి. నా జోలి ఒకరి కెందుకు? నా యిష్టం వచ్చినట్లు నేను చేసుకుంటాను. ఒక రెవరు నన్నడగటాని కసలు— అని వారు కోపంగా మాట్లాడారట.

ఇట్లా తొందరపడి మాట్లాడినంత తేలికగా పోతుందా అబ్బాయి చేసుకున్న తరువాత అని మా నాన్నగారు అనేటప్పటికి.

పోకపోతే చేతనైందేమైనా వుంటే చేసుకో పోయి. ఇదిమొదలు చేసుకుని నా వాకిలిచాయలకు రాబోకండి ఎవరైనాసరే—అని లేచివెళ్లారట. అంతే. అప్పటినుంచీ ఇక నా విషయంలో ఆయనకు పెద్ద విచారం ఏర్పడిపోయింది మనస్సులో. ఆయన వ్యాధి కూడా ఇంకా ఎక్కువ కావటం మొదలు పెట్టింది. వారు మళ్ళీ పెళ్ళిచేసుకున్న తరుమాత ఆయన వ్యాధి ఇంకా ప్రబలమై చివరకు ప్రాణాలు కూడా విడువవలసి వచ్చింది. మా నాన్న ప్రాణం పోయేటప్పుడు ఆ బాధ చూడలేక నేను చాటుకు పోయి కళ్ళనీళ్ళు పెట్టుకుంటున్నప్పటికీ ఆయన ప్రాణం పోయేటప్పుడు కూడా నన్నే తలుస్తూ వుండటం నాకు కూడా వినబడుతూనే వున్నది. తను పోతున్నానే అనీ, నేను కష్టంలో వున్నాననీ, నాకు బాగా జరుగుతుందో జరగదోననీ, ఆయన

భయం. అందువల్లనే ఆయన నన్నంతగా తలుస్తూ ప్రాణాలు వదిలారు.

అప్పటినుంచీ ఇక నా కష్టాలు అడుగుతారు. అంతకుముందు నే ననుకుంటుండేదాన్ని—జరిగిందేదో జరిగింది మా అమ్మా నాన్న బాగుండగానైనా నేను చనిపోతే బాగుండునని. కాని నేను జీవితంలో వేటికి భయపడ్డానో అవల్లా నాకే జరుగుతూ వచ్చినవి. అక్కడినుండి ఇక్కడికి రావటం ఇంటికి దూరమై చెట్టునీడకు వచ్చినట్లయిందిప్పుడు నాపని. మా అమ్మ కిప్పుడు నామీద ఎంత ప్రేమవుంటే మాత్రం ఏంచేయగలుగుతుంది? మా నాన్న వున్నప్పుడే అంతంత మాత్రమాయె. మా నాన్న పోయిన తరువాత మా అమ్మ నోరెత్తటానికే వీలులేకుండా పోయిందా యింట్లో. ఆమే మా అన్నయ్యదగ్గర మనోవర్తి పుచ్చుకోవలసిన పరిస్థితుల్లో ఇంకా నన్నేం పోషించగలుగుతుంది? ఈ పరిస్థితుల్లో నా పౌరుషం కోసమని నా భారాన్ని కూడా ఆమెమీద మోపి ఆమెను బాధించేకన్నా ఎన్నికష్టాలైనా రానీ, నా భారాన్ని నేనే మోయాలి. ఈ పని చేయాలంటే మళ్ళీ అక్కడికే వెళ్ళక తప్పదు. ముమ్మాటికీ తప్పదు. కాని నిజంగా అలా చేయగలనా? ఏమిటో నిరాశమూలాన కలిగే నిస్తబ్దతవల్ల అలా అనుకోవటమే కాని చెయ్యక ఏంచేస్తాను? జీవితంలోని ఈ నిస్తబ్దత సర్వనాశానికే దారితీసేదిగా కనబడుతూ వుంది. ఈ నిస్తబ్ధతనుంచీ బయటపడాలి అంటే తప్పకుండా మళ్లీ అక్కడికి వెళ్లాలి. ఇప్పుడు అక్కడి పరిస్థితులు వెనుకటి పరిస్థితులు కావు. ఆనాటి అత్తగారు లేదు. వారిలో కూడా వయస్సును బట్టి అయితేనేం, అనుభవాలనుబట్టి అయితేనేం, ఆ నాటి దుందుడుకుతనమూ లేదు. నిజంగా అంత దుందుడుకుతనమే ఉంటే మళ్ళీ రమ్మంటారా? పరిస్థితులు మార్పు మానసికమైన మార్పుకుకూడా తోడ్పడవచ్చు. ఈ అవకాశాన్ని పురస్కరించుకుని వారిలో మార్పు తీసుకురావటానికి ప్రయత్నం చేయాలి. ఈమాత్రం నేను చేయలేకపోతే నా బాధలు నాకే కాకుండా ఇతరుల కష్టాలను ఇనుమడింపచేయటానికి కూడా తోడ్పడతవి. నా క్షేమంకోసం కాకపోయినా కనీసం నా సంబంధీకుల క్షేమంకోసమైనా మళ్ళీ అక్కడకు వెళ్లితీరాలి కాని అబ్బబ్బ. నా జీవితాన్ని నేనే ఒకసారి పునరాలోకనం చేసుకునేటప్పటికీ ఆ సంఘటనలన్నీ కళ్ళల్లో కదను త్రొక్కుతూ హృదయంలోకి దూసుకుపోతున్నై. ఈ ఆలోచనలతో నా మెదడు చుట్టలు తిరిగిపోతూ వున్నది. ఈ బాధలతో నా హృదయం రక్తాన్ని చిమ్ముతూ వున్నది. నా తెలివితేటలు ప్రతిభ, యవ్వనము అన్నీ మిళితమై మనసై ఈ చుట్టలు తిరిగిన రక్తపు టేరులలో కలసిపోయినవి. ఇంకా నాకు స్వతంత్రతేమిటి? ఆలోచనేమిటి? నిర్ణయమేమిటి? ఈ సమాజంలో ఇదేనా నా స్థానం? ఇదేనా భారతనారీమణుల సౌశీల్యసంప్రదాయం? ఇదే కాబోలు భారతనారీమణులు గవర్నర్లుగా వుండటం, మంత్రులుగా వుండటం, విదేశాంగ రాయబారులుగా వుండటమూను!

